నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 29 ఏప్రిల్ 2024 | NAGARKURNOOL

ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నిజానికి, అబద్ధానికి మధ్య పోరు

- కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీల పాలన
- కాంగ్రెస్‌ను మళ్లీ నమ్మితే మోసపోతాం..
- ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 28 : ఎంపీ ఎన్నికలు.. పదేండ్ల తెలంగాణ పాలనలో జరిగిన నిజమైన అభివృద్ధికి, వందరోజుల కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధపు పాలనకు మధ్య జరుగుతున్నవని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఖిల్లాఘణపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రాణాలు అడ్డుపెట్టి తెలంగాణను సాధించిన ఉద్యమ నేత కేసీఆర్ రాష్ట్రాన్ని కన్నబిడ్డలాగా సాదితే.. కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పారిశ్రామిక వర్గాలను అరిగోస పెడుతుంటే సహించలేక 70 ఏండ్ల వయసులో, ఎర్రటి ఎండలో పోరుబాట పట్టిన గొప్పనేత కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని.. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, మళ్లీ ఆ పార్టీకి ఓటేస్తే రాష్ట్రం అంధకారమవుతుందన్నారు. వారిని నమ్ముకుంటే మళ్లీ మోసపోతామని, కరువు తెచ్చిన పార్టీకి పార్లమెంట్ ఎన్నికలో కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపుదామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లాయిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- సేవకుడిగా పనిచేస్తా : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

పాన్‌గల్, ఏప్రిల్ 28 : ప్రజలను నిత్యం మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లాయిపల్లిలో ఆదివారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అధికారం కోసం పరితపించే నాయకుడు కావాలా? ప్రజాసమస్యలపై పోరాడే నాయకుడు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మంచి ఆలోచనాపరుడు.. పరిపాలన దక్షత కలిగిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. కేసీఆర్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. అబద్ధాల నిచ్చెన మెట్లు ఎక్కిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీగా తనను గెలిపిస్తే పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అహంకారానికి, ఆశయానికి జరుగుతున్న పోరాటంలో తుది తీర్పు ప్రజలదేనని, కారు గుర్తుకు ఓటేయాని కోరారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, అభిలాష్‌రావు, అడ్వకేట్ రవి, రాజేశ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరసింహానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను మాట్లాడుతున్నా..!

- లైసెన్స్ గడువు ముగిసినా రెన్యువల్ చూసుకోరా.. అంటూ ఫోన్
- ప్రతీ విషయం మేమే గుర్తు చేయాలా..?
- డబ్బులు ఫోన్‌పే చేయండి.. రెన్యువల్ చేస్తామంటూ కాల్స్
- సైబర్ నేరస్తుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

గద్వాల అర్బన్, అర్బన్ 28 : హోటళ్లు, రెస్టారెంట్లు, క్లినిక్స్ తదితర వాటికి ఫోన్ చేసి నేను మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా.. లైసెన్స్ గడువు ముగిసినా ఇంకా రెన్యువల్ చేసుకోరా.. కలెక్టర్ గారు రెన్యువల్ విషయంపై ఆరా తీస్తూ ఏం చేస్తున్నారు? వెంటనే వసూలు చేయండంటూ ఆదేశిస్తున్నారు. మీరేమో పట్టించుకోవడం లేదు.. వెంటనే డబ్బులు ఫోన్‌పేలో ట్రాన్స్‌ఫర్ చేయండి.. లైసెన్స్ రెన్యువల్ చేస్తా అంటూ.. ఓ సైబర్ నేరగాడు డబ్బులు వసూలు చేసి పోలీసుకలకు చిక్కిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. సీఐ భీమ్‌కుమార్ కథనం మేరకు.. శరత్ చంద్రారెడ్డి జిల్లా కేంద్రంలో ఓ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 16వ తేదీన.. 'నేను మున్సిపల్ కమిషనర్‌ను అంటూ ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి మీ రెస్టారెంట్ లైసెన్స్ గడువు ముగిసిపోయి చాలా రోజులైంది. ఎందుకు ఇంకా రెన్యువల్ చేసుకోలేదు? గడువు ముగిసినా మీరు చూసుకోరా.. మీరేం పట్టన్నట్లు ఉంటారు.. కలెక్టర్ గారు మాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏం చేయాలో చెప్పండంటూ రెస్టారెంట్ నిర్వాహకులు నమ్మేలా సైబర్ నేరగాడు వ్యవహరించాడు. దీంతో హిమాలయ రెస్టారెంట్ నిర్వాహకులు సార్.. మా రెస్టారెంట్ రెన్యువల్ రెండు నెలల కిందటే చేశామని సమాధానమిచ్చారు. దీంతో మీ రెన్యువల్ పేపర్లు వాట్సాప్‌కు పెట్టండి.. ఒకసారి చూస్తానని చెప్పండంతో వారు పంపారు. గడువు ముగిసేలోపు ఇలాగే రెన్యువల్ చేసుకోవాలని చెప్పి వెంటనే ఫోన్ కట్ చేశారు. అనంతరం పుడ్‌వరల్డ్ రెస్టారెంట్ నిర్వాహకులకు ఫోన్ చేసి ఇలాగే మాట్లాడాడు. దీంతో వాళ్లు సార్ నేను రేపు ఆఫీస్‌కు వచ్చి రెన్యువల్ చేసుకుంటా.. రేపటి వరకు టైం ఇవ్వండని అడిగాడు. ఇప్పటికే చాలా సమయమైంది. రెన్యువల్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు మీకు తెలుసా..? దానికోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఉంది. మీరు డబ్బులు ఫోన్‌పే చేయండని స్కానర్ పంపించాడు. బాధితుడు స్కానర్‌కు రూ.7వేలు ఫోన్‌పే చేసి త్వరగా చేయండి సార్ అంటూ ఫోన్ పెట్టేశాడు. మరుసటి రోజు బాధితుడు ఫోన్ చేయగా మా సిబ్బంది రెన్యువల్ పేపర్లు తీసుకొచ్చి ఇస్తారు.. అదనంగా రూ.500 ఫోన్‌పే చేయండని చెప్పాడు. మళ్లీ డబ్బులు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించాడు. వెంటనే అవతలి వైపు నుంచి ఫోన్ కట్ చేశాడు. బాధితుడికి అనుమానం వచ్చి ఫోన్ లిస్ట్ చెక్ చేసుకోగా తన నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు గుర్తించాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సైబర్ నేరగాడు నెల్లూరు బస్టాండ్‌లోని ఓ షాపు నిర్వాహకుడి దగ్గరకు వెళ్లి తమ బంధువులు ఫోన్‌పేకు డబ్బులు వేస్తారు.. అమౌంట్ ఇవ్వండని సదరు రెస్టారెంట్ వ్యక్తి వేసిన నగదును తీసుకున్నాడు. ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు.. సీఐ భీమ్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈక్రమంలో సైబర్ నేరగాడు గద్వాల బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుడడంతో పోలీసులు పట్టుకొని విచారించారు. సైబర్ నేరగాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన బిల్ల నాగేశ్వర్‌రావుగా గుర్తించారు. ఇతడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో మున్సిపల్ అధికారి పేరుతో చాలామందిని మోసం చేసి పరారైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్‌స్టేషన్లలో చాలా కేసులు నమోదైనట్లు గుర్తించారు. సైబర్ నేరగాడిని శనివారం రాత్రి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు.

నాగర్‌కర్నూల్‌లో శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నేతలు, ప్రజలు

నూతనోత్సాహం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో బస్సుయాత్ర సక్సెస్
- కేసీఆర్ వెంటే నడిచిన అశేష జనవాహిని
- ఉద్యమనేతను చూసేందుకు ఎగబడిన రైతులు, యువత
- దారి పొడవునా గులాబీ దళపతికి నీరాజనం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అదనపు బలం
- కాంగ్రెస్‌లో మొదలైన గుబులు..
- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఎస్పీకి పెరిగిన క్రేజ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ నిర్వహించిన పోరుబాట బస్సుయాత్ర విజయవంతమైంది. రెండ్రోజుల పాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన రోడ్ షో, కార్నర్ మీటింగ్ సక్సెస్ అయ్యింది. రోడ్ షోను విజయవంతం చేసేందుకు గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయగా కేసీఆర్‌ను చూసేందుకు జనం ఎగబడ్డారు. బస్సుయాత్ర సందర్భంగా కేసీఆర్ ఒకరోజు పాలమూరులోనే ఉండి రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఇక్కడి నుంచే రాష్ట్రంలో కరెంటు కోతలపై తన ఎక్స్ ఖాతాలో ఎండగట్టారు. రోడ్ షో విజయవంతం కావడంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నది.

రెండ్రోజుల పాటు..

ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను కళ్లారా చూసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పోరుబాట పేరిట బస్సుయాత్ర ప్రారంభించారు. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అడుగుపెట్టిన యాత్రకు జనం నీరాజనం పలికారు. దారి పొడవునా అధినేతను చూసేందుకు పోటీపడ్డారు. ఆయా మండలకేంద్రాల్లో గులాబీ శ్రేణులు కేసీఆర్ బస్సుపై పూలవర్షం కురిపించారు. సీఎం ఇలాఖాలో కేసీఆర్ చేపట్టిన పోరుబాట విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో గుబులు మొదలైంది. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఇసుకేస్తే రాలనంత జనం హాజరయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలను కేసీఆర్ ఎండగడుతుంటే.. వద్దురా బాబు ఈ కాంగ్రెస్ పాలన అంటూ ప్రజలు నినాదాలు చేశారు.

పోటెత్తిన జనం..

పాలమూరులో కేసీఆర్ బసజేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసం వద్ద శనివారం కోలాహలం నెలకొన్నది. అధినేతను చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలొచ్చారు. సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో బస్సుయాత్ర చేపట్టేందుకు గులాబీ బాస్ బయటకు రావడంతో ఒక్కసారిగా జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం కేసీఆర్ బస్సు ఎక్కి అభివాదం చేస్తూ కందనూలుకు పయనమయ్యారు. ఈ క్రమంలో భూత్పూర్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఆల ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా కేసీఆర్‌కు జనం చేతులు ఊపుతూ కనిపించారు. అధినేతను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు.

పార్లమెంట్‌పై నజర్..

ఉమ్మడి పార్లమెంట్‌లోని రెండు స్థానాలను మళ్లీ నిలబెట్టుకోవాలని పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. పదేండ్లలో పాలమూరును ఎంతో అభివృద్ధి చేశామని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నారన్నారు. గ్రామస్థాయిలో ప్రచారాలు ముమ్మరం చేసి ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ చేపట్టిన రోడ్ షో విజయవంతం కావడంతో కాంగ్రెస్ నేతలకు భయం పట్టుకున్నది. ఇప్పటికే పాలమూరు పార్లమెంట్ స్థానంపై పట్టు నిలిపేందుకు కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఏకంగా సీఎం నాలుగుసార్లు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పర్యటించినా జనం నుంచి స్పందన రాలేదు. కానీ కేసీఆర్ రోడ్ షోకు మాత్రం భారీ ఎత్తున జనం రావడంతో ఆ పార్టీ అంతర్మథనంలో పడింది. అధినేత రోడ్‌షో గులాబీ పార్టీలో నయా జోష్‌ను నింపింది.

కందనూలులో కారు జోష్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : కందనూలులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గ్రాఫ్‌ను మరింత పెంచింది. దీంతో గ్రామస్థాయిలోనూ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కారు స్పీడ్ జోరందుకున్నది. జిల్లాకేంద్రంలో కేసీఆర్ ప్రసంగం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బలం పెంచగా కాంగ్రెస్, బీజేపీలను ఆత్మరక్షణలోకి నెట్టింది.

కేసీఆర్ బస్సుయాత్ర కందనూలు బీఆర్ఎస్ కార్యకర్తల్లో సంబురాన్ని నింపింది. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చేపట్టిన బస్సుయాత్ర నాగర్‌కర్నూల్‌లో విజయవంతమైంది. వేలాదిమంది పార్టీ నాయకులు, శ్రేణులు తరలిరావడంతో బీఆర్ఎస్ నాయకులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. కేసీఆర్ యాత్రకు వచ్చిన అశేష జన సందోహం కాంగ్రెస్, బీజేపీల్లో నిస్తేజాన్ని నింపింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత పలుమార్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తూ వస్తున్నారు. కాగా శ్రేణుల్లో స్తబ్ధత నెలకొనగా ఇతర పార్టీలు చులకనగా చూస్తూ వస్తున్నారు. ఈక్రమంలో కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర ఆ అనుమానాలన్నింటినీ తుడిచిపెట్టేసింది. వేలాది ప్రజలు జిల్లాకేంద్రంలో మూడు కిలోమీటర్ల పొడవునా నిల్చొని కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అశేష జనవాహినిని చూసిన కాంగ్రెస్, బీజేపీల్లో భయం మొదలవగా బీఆర్ఎస్‌కు ఫుల్ క్రేజ్‌ను తీసుకొచ్చింది. కేసీఆర్ వస్తుండడంతోనే కార్యకర్తల్లో నయా జోష్ నెలకొన్నది. ఈ యాత్రకు యువకులు, రైతులు భారీగా తరలొచ్చి కాంగ్రెస్, బీజేపీలపై వ్యతిరేకతను చాటారు. కేసీఆర్ అరగంట ప్రసంగాన్ని కేరింతలు, ఈలలు, నినాదాలతో ఆసక్తిగా విన్నారు. ప్రజల ఉత్సాహాన్ని చూసిన కేసీఆర్ సైతం ముగ్ధుడయ్యారు. ఆరు గ్యారెంటీల పేరుతో జరిగిన మోసాన్ని, బీజేపీ పథకాల పేర్లను చెప్తూ కేసీఆర్ చేసిన ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసింది. సమావేశానికి రావడంతోనే సరిపెట్టుకోకుండా గ్రామాల్లో తాను చెప్పిన విషయాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని కేసీఆర్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకున్న శ్రేణులు పార్లమెంట్ ఎన్నికల్లో స్పీడ్ పెంచారు. కేసీఆర్ ప్రసంగాన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలన్న విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరిస్తున్నారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కేసీఆర్ ప్రశంసించిన తీరు ఆయనకు మరింత క్రేజ్‌ను తీసుకొచ్చింది. ప్రవీణ్ గొప్పతనం, ఆయన కమిట్‌మెంట్, గెలిపించాల్సిన ఆవశ్యకత, గెలిస్తే వచ్చే ఫలితాలను కేసీఆర్ విడమరిచి చెప్పడం విశేషం. ఇది ఆర్ఎస్ ప్రవీణ్‌కు సానుకూలాంశం కానుంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పోలిస్తే ఆర్ఎస్పీకి ఉన్న ప్రత్యేకతను ఈ సభ ద్వారా కేసీఆర్ ప్రజలకు వివరించారు. ఇదంతా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, ఆర్ఎస్ ప్రవీణ్ గెలుపునకు దోహదం చేయనున్నది. మొత్తం మీద కేసీఆర్ బస్సుయాత్ర పార్టీ శ్రేణులను పార్లమెంట్ ఎన్నికలకు సమాయాత్తం చేసింది. గ్రామగ్రామాన గులాబీదండు ఆర్ఎస్ ప్రవీణ్, బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రచారం ముమ్మరం చేసింది.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి

- గుండెల మీద తన్నిన కాంగ్రెస్‌ను గడ్డపారలై పొడుద్దాం..
- వాళ్లొచ్చాకే నీళ్లు కనుమరుగాయే..
- రైతుల అవస్థలు వర్ణణాతీతం
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 28 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే తెలంగాణలో నీళ్లు కనుమరుగయ్యాయని, పంటలు ఎండి రైతులు నానా అవస్థలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నాగర్‌కర్నూల్ మండలం పుల్జాల, మంతటి, వనపట్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి నెరవేర్చలేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో వడ్లను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 బోనస్‌తో కొంటామని చెప్పి.. రైతులు రూ.1,800కే అమ్ముకుంటుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఓట్లకోసం కాంగ్రెస్ లీడర్లు వస్తే బుద్ధిచెప్పడానికి మహిళలు చీపుర్లతో సిద్ధంగా ఉన్నారన్నారు. ఆడపిల్లల పెండ్లికి రేవంత్‌రెడ్డి ఎంతమందికి తులం బంగారం ఇచ్చాడో చెప్పాలన్నారు. మన గుండెల మీద తన్నిన రేవంత్‌రెడ్డిని ఎంపీ ఎన్నికల్లో గడ్డపారలై పోటుపొడవాలన్నారు. సీఎంకు ఓటమి భయం పట్టుకుందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతే పదవి పోతుందనే భయం స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. దేవుళ్లపై ఒట్టు పెడుతూ.. రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ సెంటిమెంటల్ మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఏఊరికెళ్తే ఆ ఊరి దేవుడిపై ఒట్టుపెట్టడం సీఎంకు పరిపాటిగా మారిందన్నారు. బీజేపీ పదేండ్ల పాలనలో ధరలు పెంచి గరీబోళ్ల నడ్డి విరిచిందన్నారు. ప్రశ్నించే గొంతులను గెలిపివ్వండని, కాంగ్రెస్ మెడలు వంచి హామీలను అమలు చేస్తామన్నారు. అహంకారంతో కళ్లు నెత్తికెక్కిన కాంగ్రెస్ నేతలు దిగిరావాలంటే ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుల్జాల గ్రామంలో కారు గుర్తుకు ఓటేయాలని మహిళలను అభ్యర్థిస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి

మహాలక్ష్మికి ఎన్ని తిప్పలో..

- స్టేజీల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపని డ్రైవర్లు
- నాలుగు గంటలపాటు నరకయాతన
- సహనం కోల్పోయి రోడ్డుకు అడ్డంగా రాళ్లుపెట్టిన మహిళలు
- లింగాల మండలం మాడాపూర్ స్టేజీ వద్ద ఘటన

మాడాపూర్ స్టేజీ వద్ద రోడ్డుపై రాళ్లు వేసిన మహిళలు

లింగాల, ఏప్రిల్ 28 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి బస్టాప్‌లో మహిళలు కనిపిస్తే డ్రైవర్లు బస్సులు ఆపడంలేదు. చేయి ఎత్తిన చోట బస్సు ఆపాలనే నిబంధన ఉన్నప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు పాటించడం లేదు. ఈ క్రమంలో పలుచోట్ల మహిళలు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. అలాంటి ఘటనే మండలంలోని మాడాపూర్ స్టేజీ వద్ద చోటుచేసుకున్నది. మాడాపూర్, కోమటికుంట గ్రామాలకు చెందిన పలువురు మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి తెలకపల్లి మీదుగా లింగాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. స్టేజీల వద్ద చెయ్యి ఎత్తినా డ్రైవర్లు బస్సు ఆపడం లేదని వారు వాపోయారు. మహిళలను బస్సుల్లో ఫ్రీగా ఎక్కించుకోవాల్సి వస్తుందని, ఖాళీ బస్సులు తిప్పుతున్నారన్నారు. మహిళలు కనిపిస్తే బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగాలలో ఆదివారం సంత కావడంతో మాడాపూర్, కోమటికుంటకు చెందిన మహిళలు కూరగాయలు కొనేందుకు మాడాపూర్ స్టేజీ వద్ద ఉదయం 11 గంటలకు వచ్చి నిల్చున్నారు. వచ్చిన బస్సు వచ్చినట్టు వెళ్తున్నాయే తప్పా ఒక్కటి కూడా ఆపలేదు. ఇలా సమయం కాస్త మధ్యాహ్నం 3గంటలైంది. దీంతో విసుగు చెందిన సదరు మహిళలు ఆగ్రహంతో రహదారిపై రాళ్లను అడ్డంగా ఉంచారు. దాదాపు నాలుగ గంటలు స్టేజీ వద్దే ఉన్న మహిళలు ప్రభుత్వంపై ఊగిపోయారు. ఫ్రీగా బస్సులు నడుపుతున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మేం పడుతున్న ఇబ్బందులు పట్టవా అని ప్రశ్నించారు. ఆర్టీసీ యాజమాన్యం, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్రీ బస్సులతో తిప్పలైతుంది..

ఫ్రీ బస్సు ఎందుకే సిండు ఆయన (రేవంత్‌రెడ్డి).. అట్ల పెట్టకుంటే పైసల్‌తో పోతుంటిమి. నిన్న మొన్న చార్జి పెట్టుకొని తిరిగినం. ఇప్పుడు కూడా అట్లే పోతం. ఆటోల్లళ్ల స్టేజీకాడికి వచ్చి లింగాలకు పోయి సంతల కూరగాయలు తెచ్చుకుందామని వచ్చినం. నాలుగు గంటలసేపు ఎదురుచూసినం. ఎండకు ఎంతసేపు నిలబడాల. వచ్చిన బస్సులు వచ్చినట్టే ఆపకుండ పోతున్నరు. ఈ స్కీంతోన శానా తిప్పలైతుంది.

- చిట్టెమ్మ, కోమటికుంట, లింగాల మండలం

ఈతవనం దగ్ధం

- కాలిబూడిదైన రెండువేలకు పైగా చెట్లు
- ఉద్దేశపూర్వకంగానే అంటించారని అంటున్న గీత కార్మికులు
- మాగనూరు మండలం నేరడుగం శివారులో ఘటన

మాగనూరు, ఏప్రిల్ 28 : ఈతవనం దగ్ధమైన ఘటన మండలంలోని బైరంపల్లి శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. గీత కార్మికుల కథనం మేరకు.. బైరంపల్లి, నేరడుగం శివారులోని ఈతవనాన్ని ఎవరో ఉద్దేశపూర్వకంగానే దగ్ధం చేశారు. కల్లుగొబ్బలను ధ్వంసం చేసిన ఘటనపై నారాయణపేట ఆబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండువేలకు పైగా ఈతచెట్లు కాలి బూడిదయ్యాయన్నారు. కల్లు అమ్ముతూ చాలా గౌడ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇప్పుడు వారంతా రోడ్డున పడే అవకాశం ఉందని వాపోయారు. కొన్ని రోజుల కిందట ఇలాగే నిప్పుపెట్టగా గమనించి మంటలను ఆర్పి కొన్ని చెట్లను కాపాడుకోగలిగామన్నారు. మళ్లీ ఇప్పుడు అట్లే చేశారన్నారు. ఈ ఘటనకు కారకులను శిక్షించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఈతవనంలో చెలరేగుతున్న మంటలు